
29. 10 2000



# అనుబంధాలు



రావినూతల సువర్ణాకన్నన్

"పిన్నిగారూ!" అన్న పిలుపుతో తృళ్ళిపడి కళ్ళు తెరిచింది. ఎదురుగా వాళ్ళింట్లో అద్దెకుంటున్న మహేష్.

"పిన్నిగారూ! రాత్రినించీ మీరు పచ్చిమంచినీళ్ళు తాగలేదు. నా మాటవిని కాస్త ఎంగిలిపడి రండి. పంతులుగారి దగ్గర నేనుంటాను" అన్నాడతను.

"ఒద్దు మహీ! నాకు ఆకలిగా లేదు!" నిర్లిప్తంగా అందావిడ.

"అలా అంటే లాభంలేదు. పంతులుగారిని చూడ్డానికైనా మీకు ఓపిక వుండాలికదా. ఓపిక్కావాలంటే కడుపులో ఏదైనా పడాలికదా! అందుకే నాలుగు మెతుకులు తినిరండి. నేనిక్కడే కూర్చుంటాను" అంటూ ఆమెని బలవంతంగా వంటింట్లోకి పంపాడు మహేష్.

యాజులుగారికి ఎనభై ఏళ్ళుంటాయి. ఆయన హయాంలో పౌరోహిత్యం చేసి, ముహూర్తాలు పెట్టి ఇంత డబ్బు, పేరు ప్రఖ్యాతులూ సంపాదించాడు. వున్న వూళ్ళో పెద్ద ఇల్లూ పల్లెపట్టున పదెకరాల మాగాణి ఏర్పరచుకున్నాడు. ఇద్దరు కొడుకులకీ మంచి చదువులు చెప్పించాడు. కొడుకులు పెద్ద ఉద్యోగాలు చేసుకుంటూ ఢిల్లీలో స్థిరపడినా, సిటీలో అయితే తమ ఆచార వ్యవహారాలకి అంతరాయం కలుగుతుందన్న వుద్దేశంతో భార్యాభర్తలిద్దరూ వున్న వూళ్లోనే ఒకరికొకరు తోడుగా హాయిగా వుంటున్నారు. దాదాపు ఏడాది క్రితం మహేష్ వాళ్ళింట్లోకి అద్దెకి దిగాడు.

ఆర్థిక ఇబ్బందుల వల్ల అతనికి ఇల్లివ్వలేదు యాజులుగారు. వృద్ధులైన తమ దంపతులకి కాస్త మనిషి సాయం వుంటుందని మాత్రమే ఇచ్చాడు.

మహేష్‌కి కులగోత్రాలు లేవు. వూహ తెలిసిందగ్గర్నించీ ఓ అనాథాశ్రమంలో పెరిగాడు. నానా అవస్థలూపడి పి.జి పూర్తిచేసి బేంక్‌లో వుద్యోగం సంపాదించుకున్నాడు. చూడ్డానికి దొరబాబులా వున్న అతను సావిత్రమ్మని బాగా ఆకర్షించాడు. అందుకే అతని పుట్టుపూర్వోత్తరాలు తెలిసీ నిప్పుకడిగే ఆ ఇంట్లో వుండనిచ్చింది. .

రాయిలా తిరిగే యాజులుగారు వారం రోజుల క్రితం మంచానపడ్డారు. డాక్టర్లు చూసి హై.బి.పి వుందని ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు. అయితే రోగం దారిది రోగానిదే, మందుల దారి మందులదే అన్నట్టు ఆయన రోగం పెరిగి మూడు రోజులుగా దాదాపు కోమాలో వున్నాడు. డాక్టర్లు పెదవి విరిచేశారు.

మహేష్ అప్పటికే యాజులుగారి కొడుకులకి ఫోన్ చేశాడు. వాళ్ళు బయల్దేరుతున్నట్టు చెప్పారు.

ఆ రాత్రి యాజులుగారికి మరీ కిందామీదా అయింది. తల్లడిల్లిపోయింది సావిత్రమ్మ. ఏడ్చిఏడ్చి కళ్ళు వాచిపోయాయి. తిండి నిద్రలేక నీరసించిపోయింది. అలాంటి సమయంలో మరింత చేరువ అయ్యాడు మహేష్.

మరోసారి భయంకరంగా గర్జించింది ఆకాశం.

తృళ్ళిపడి చూశాడు మహేష్.

అప్పుడే భోజనం చేశాననిపించి వచ్చిన సావిత్రమ్మ-

"మహీ! ఇంకా పిల్లలు రాలేదేంరా?" అంది దీనంగా.

"వచ్చేస్తారు పిన్నిగారూ. బయల్దేరామని కూడా ఫోన్ చేశారుగా. మీరు కాస్సేపు పడుకోండి. పంతులుగారి దగ్గర నేనుంటాను" అన్నాడతను.

"ఒద్దులే. నువ్వెళ్ళు. నేనిలా చాపమీద పడుకుంటాను" అంది సావిత్రమ్మ యాజులుగారి మంచం పక్కనే ఓ చాప పరుచుకుంటూ.

ఆమె మనసు తుఫాన్‌లో చిక్కిన నావలా వూగిపోతోంది. కొడుకులు రాగానే వాళ్ళ గుండెల్లో తల దాచుకుని కరువు తీరా ఏడిస్తే తన బాధ కాస్త తగ్గుతుందనిపించింది కూడా.

తెల్లారేసరికల్లా ఇద్దరు కొడుకులూ తమ భార్యాబిడ్డలతోసహా దిగారు. శవాకారంలా పడుకున్న తండ్రినీ, జీవం కోల్పోయిన కళ్ళతో శూన్యంలోకి చూస్తున్న తల్లినీ చూసి తల్లడిల్లిపోయారు. కోడళ్ళు కూడా సావిత్రమ్మకి ఎన్నోవిధాలుగా ధైర్యం చెప్పారు. సావిత్రమ్మక్కూడా కాస్త ధైర్యం వచ్చింది. కొండంత శక్తి వచ్చినట్టయింది.

రెండురోజులు భారంగా గడిచిపోయాయి.

డాక్టర్ల అంచనాలని తారుమారు చేస్తూ యాజులుగారు కళ్ళు తెరిచారు. పొంగిపోయింది సావిత్రి. తృప్తిగా నిట్టూర్చారు కొడుకులు.

మరో నాలుగురోజుల తర్వాత తండ్రి ప్రమాదం నించి తేరుకున్నాడని గ్రహించి జాగ్రత్తలు చెప్పి తల్లిదండ్రుల బాధ్యతల్ని మహేష్‌కి డాక్టర్‌కి అప్పగించీ వెళ్ళిపోయారు.

"ఇంకో నాలుగు రోజులుంటే నాకు ధైర్యంగా వుంటుందిరా" అంటున్న తల్లి మాటలకి-

"ఇంక నాన్నకేం పర్లేదమ్మా! మహేష్ దగ్గరుండి చూసుకుంటున్నాడు. డాక్టర్‌గారు కూడా ప్రమాదం దాటిందన్నారు" అంటూ నచ్చచెప్పి వెళ్ళిపోయారు.

అయితే పదిరోజుల తర్వాత యాజులుగారు మళ్ళీ మృత్యు ముఖంలోకెళ్ళిపోయారు. ఈసారి స్మారకం పోవడమే కాక గురక కూడా మొదలయింది. డాక్టర్లు ఫలితం లేకపోయినా హాస్పటల్లో చేర్చమన్నారు. అయితే తను అంతిమశ్వాస ఇంట్లోనే తీయాలని యాజులుగారు కోరడంతో సావిత్రమ్మ హాస్పటల్లో చేర్చలేదు. రెండురోజుల తర్వాత యాజులుగారిని హాల్లో చాపమీదికి చేర్చారు.

"భగవంతుడా! నా భర్తని కాపాడి నా పసుపు కుంకుమల్ని నిలుపు" అంటూ వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది సావిత్రమ్మ.

"లాభంలేదు మిస్టర్ మహేష్! వెంటనే వాళ్ళ పిల్లల్ని పిలిపించండి" అంటూ సలహా ఇచ్చారు డాక్టర్లు.

సావిత్రమ్మ కోరిక మేరకు మహేష్ యాజులుగారి పిల్లలకి పరిస్థితి వివరిస్తూ ఫోన్ చేశాడు. సావిత్రమ్మ కూడా ఏడుస్తూ భర్త పరిస్థితి చెప్పి వెంటనే బయల్దేరి రమ్మంది.

"నువ్వేం కంగారుపడకమ్మా! మేం బయల్దేరుతున్నాం" అంటూ తల్లికి ధైర్యం చెప్పారు పిల్లలు.

అన్నట్టే రెండో రోజుకల్లా దిగారు. అయితే ఈసారి భార్యాబిడ్డల్ని తీసుకురాలేదు. తల్లి అడిగితే-

"పిల్లలకి పరీక్షలమ్మా... వెళ్ళగానే ఫోన్ చేస్తామనీ, తర్వాత బయల్దేరి రమ్మనీ చెప్పాం" అన్నారు. మరి మాట్లాడలేదా తల్లి.

యాజులుగారికి వచ్చే ప్రాణం పోయే ప్రాణంలావుంది. తులసి తీర్థం అదీ సిద్ధం చేశారు. మహేష్ బేంక్‌కి శలవు పెట్టి మరీ అక్కడి పనులు చూస్తున్నాడు.

"ఈయన ప్రాణం ఏ క్షణానైనా పోవచ్చు. కానీ ఇన్నాళ్ళూ కింద పడుకోబెట్టడం అంత బాగాలేదు. మేం ఎన్ని సార్లు చెప్పినా మీ అమ్మగారు వినిపించుకోవడంలేదు. కాస్త మీరైనా చెప్పండి" అన్నారు డాక్టర్లు. కొడుకులు తల్లికేసి చూశారు.

"ఒద్దురా! ప్రాణం మంచంమీద పోకూడదు" దుఃఖాన్ని తొక్కిపెడుతూ అంది సావిత్రమ్మ.

"పోన్లెండి. ఆవిడ నమ్మకం ఆవిడది" భారంగా అన్నారు పిల్లలు.

"ఇంతకీ నాన్నగారి పరిస్థితి..." మెల్లిగా అన్నాడు పెద్దకొడుకు.

"ఇవాళ గడవడం కష్టం. అసలాయన ప్రాణం మీకోసమే ఆగిందనుకుంటాను" అన్నాడు డాక్టరు.

"నిజమే" కళ్ళు తుడుచుకుంటూ అన్నారు పిల్లలు.

అయితే అందరూ అనుకున్నట్టు యాజులుగారు కన్ను ముయ్యలేదు. అలా చావూకాకుండా, బతుకూ కాకుండా పడున్నాడు. మూడురోజుల తర్వాత ఇంక చూడలేక భర్తని మంచం మీదికి చేర్పించింది సావిత్రమ్మ.

డాక్టర్లు వస్తున్నారు మందులిస్తున్నారు. ఫలితం మాత్రం శూన్యం. మునపటిలా భర్త మళ్ళీ కళ్ళు తెరుస్తాడేమో అని గంపె



1

డాశతో ఎదురుచూస్తోంది సావిత్రమ్మ.

ఆ రాత్రి భోజనాలయ్యాక కొడుకులిద్దరూ అవతలికెళ్ళారు. సావిత్రమ్మ అలా తూలుకుంటూ మంచినీళ్ళకోసం వంటింటికేసి నడిచింది. పెరట్లోకెళ్ళిన కొడుకుల్ని చూసి-

"చీకట్లో వీళ్ళటుకేసి వెళ్ళారేవిటి దొడ్డంతా అడవిలా వుంది. పురుగుపుట్రా వుంటాయేమో కూడా" అనుకుని వాళ్ళని పిలవబోతూ ఠక్కున ఆగిపోయింది. కారణం వాళ్ళేదో రహస్యంగా మాట్లాడుకోవడమే. తెలియని అనుమానం ఆమెని ఒణికించింది. అలా తూలుతూనే కిటికీ దగ్గరికెళ్ళింది. వాళ్ళు మెల్లిగా మాట్లాడుతున్నా వాళ్ళ మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

"అన్నయ్యా! నాన్న పరిస్థితి ఏమిటంటావ్!" అన్నాడు చిన్న కొడుకు.

"నాకూ అర్థం కావడంలేదురా! ఆ డాక్టర్లేమో ఎప్పుడో పోతాడని చెప్పారు. ఈయన చూస్తే బొంది పట్టుకుని వేలాడుతున్నాడు" విసుగ్గా అన్నాడు పెద్దకొడుకు.

"చిన్నవాళ్లు టపటపమని ఎగిరిపోతారుగానీ ఈ ముసలాళ్ళు అంత తేలిగ్గా పోర్రా!"

"ఏం పోవడమో! ఆయన చావుకాదుగానీ మన చావుకొచ్చిపడింది. పోనీ ఓ పని చెయ్యకూడదూ!"

"ఏమిటి?"

"నువ్వు ఇక్కడే వుండు. నేనెళ్ళి అక్కడ పనులు చూసుకొస్తాను. మా ఆఫీసులో చాలా పెండింగ్ వర్క్ వుండిపోయింది!" అన్నాడు పెద్దకొడుకు అనునయంగా.

"అమ్మో! నేనా? నాకసలు కుదరదు. మా ఆఫీసరు చండశాసనుడు. అసలు లీవే ఇవ్వనన్నాడు. నాన్న సంగతి చెప్పి బైటపడ్డాను. ఇప్పుడు వెళ్ళి ఈయన చావలేదంటే నామాట ఇంకెప్పుడూ నమ్మడు. అందుకే రేపెళ్ళి నాన్న కాస్త కోలుకున్నాడని సర్ది చెప్తాను. అదీగాక ఏదైనా జరిగితే పెద్ద కొడుకువి నువ్వే వుండాలి" అన్నాడు చిన్నకొడుకు నిక్కచ్చిగా.

"సరే ఇద్దరం వుందాంలే."

"నాన్న మళ్ళీ కోలుకుంటే?" అనుమానంగా అన్నాడు చిన్నకొడుకు.

"ఇంకా ఏం కోలుకుంటాడు! గురక కూడా పెరిగిపోయింది. ఏ క్షణాన్నైనా పోవచ్చు" ఏదో ఆలోచిస్తూ అన్నాడు పెద్దకొడుకు.

"అంతేనంటావా?"

"కచ్చితంగా అంతే. పద అమ్మ చూస్తుందేమో" గొంతు తగ్గించి మెల్లిగా అన్నాడు పెద్దకొడుకు.

అంతే! కొడుకుల నోటినించి వచ్చిన మాటలు విన్న సావిత్రమ్మ మొదలు నరికిన మానులా కుప్పకూలిపోయింది.

"వీళ్ళు?... వీళ్ళు తండ్రి మరణం కోసం గోతికాడి నక్కల్లా ఎదురుచూస్తున్నారా! వీళ్ళనా తాము కడుపులో పెట్టుకుని పెంచింది? వీళ్ళకోసమా తాము రాత్రింబవళ్ళు కష్టపడింది!"

ఆమెకి స్పృహ పోతున్నట్టయింది. కళ్ళు తేలిపోయాయి. పుట్టెడు దుఃఖం వచ్చేసింది.

అప్పుడే చల్లని చెయ్యి ఆమె భుజం మీద పడింది. ఠృళ్ళిపడి చూసింది సావిత్రమ్మ.

మహేష్!

"మహీ!... వాళ్ళు..." ఒక్కసారి పుట్టెడు దుఃఖం వచ్చేసిందామెకి.

"పిన్నిగారూ! నాకంతా తెలుసు. మీరు పదండి. ఆ మాటలన్నీ మర్చిపోండి" అంటూ ఆమెని పొదివి పట్టుకుని మంచం దగ్గరికి తీసుకొచ్చాడు.

"ఏమిటమ్మా! ఏమిటలావున్నావ్?" అప్పుడే వచ్చిన కొడుకులు ఆతృతగా అడిగారు.

ఓసారి వాళ్ళకేసి సూటిగా చూసి తల దించుకుందామె. మహేష్ కల్పించుకుని.

"ఏంలేదండీ! కళ్ళు తిరుగుతున్నాయట. నిద్రాహారాలు లేవుకదూ! అదీగాక మీ నాన్నగారి గురించిన టెన్షన్ ఆమెని మరీ కృంగదీసింది. కాస్సేపు రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది" అన్నాడు.

"నిజమే. వెళ్ళి కాస్సేపు పడుకోమ్మా" అన్నారు తనయులు.

ఆమె మౌనంగా పడుకుంది. మనసులో మాత్రం- "ఎందుకురా ఇంత ప్రేమ ఒలకబోస్తారు? మాకు ఇలాంటి ప్రేమ కాదురా కావల్సింది. అసలైన ఆప్యాయత! ఆదరణ! చల్లని నీడ! ఇవిరా మాక్కావల్సింది. ఇవి మీ దగ్గర లేవని నాకు తెలిసిందిగానీ ఆ పిచ్చితండ్రికి తెలియదురా" అంటూ ఆక్రోశించింది.

మరో రెండురోజులైనా యాజులుగారిలో మార్పులేదు. కొడుకుల చిరాకు మొహాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇద్దరూ కలిసి గుసగుసలాడుకోవడమేకాదు...

"ఏమిటమ్మా ఇది! ఇలా ఎన్నాళ్ళు?" అని బాహాటంగానే అడిగేశారు.

"నేనేం చెయ్యనురా!" బావురుమంది సావిత్రమ్మ.

"ఊ! మాటకి ముందు నువ్వలా ఏడవకు. అసలే విసుగ్గా వుంది" అన్నారు చిరాకు పడిపోతూ కొడుకులిద్దరూ.

ఠక్కున నోరుమూసుకుంది సావిత్రమ్మ.

కొడుకుల మొహంలోని చిరాకు క్షణక్షణానికి పెరిగిపోతోంది.

తర్వాత డాక్టర్లని తిట్టారు చావుకి సరైన టైమ్ చెప్పలేదని. "ఏం కోరికలున్నాయో ఈయనగారి ప్రాణం బొందెని పట్టుకుని వేలాడుతోంది?" అని గొణుక్కున్నారు.

దేవుడే విస్తుపోయేలా యాజులుగారు కళ్ళు తెరిచారు. సావిత్రమ్మ కళ్ళు తళుక్కుమన్నాయి. వెంటనే ఏదో గుర్తొచ్చి కంగారుగా కొడుకులకేసి చూసింది.

ఆమె ఒంట్లోని రక్తమంతా నీరయిపోయినట్టయింది. కళ్ళు బైర్లుకమ్మాయి. కారణం కొడుకుల కళ్ళలో కనిపించిన భావమే.

ఇద్దరూ నిప్పులు కురిసేలా చూస్తున్నారు తల్లినీ తండ్రినీ మార్చిమార్చి.

"అరె! వింతగా వుందే! ఈయన కళ్ళు తెరవడం అంటే చచ్చిన మనిషి తిరిగి బతకడమే!" అన్నారు డాక్టర్లు విస్తుపోతూ.

"ఎందుకండీ మీ డాక్టర్లు. మీ మాటల్ని పట్టుకుని మేం మా పనులన్నీ మానుకుని ఇక్కడ శవజాగరణలా చేశాం! ఇప్పుడు చూడండి" అంటూ మండిపడ్డారు. విస్తుపోయారు డాక్టర్లు. అదిగమనించి-

"సారీ! మా ప్రాబ్లమ్స్ మావి. మీరేం అనుకోకండి! ఇంతకీ మా నాన్నగారెన్నాళ్ళు బతుకుతారంటారు?" అన్నారు సహనాన్ని తెచ్చుకుంటూ.

"ఇంక పర్లేదన్నారర్రా! ఇంక ఇప్పట్లో భయంలేదు. ఆయన మెల్లగా కోలుకుంటారు మీరు వెళ్ళండి!" సన్నగా నవ్వుతూ అంది



దేవుడే విస్తుపోయేలా యాజులుగారు కళ్ళు తెరిచారు. సావిత్రమ్మ కళ్ళు తళుక్కుమన్నాయి. వెంటనే ఏదో గుర్తొచ్చి కంగారుగా కొడుకులకేసి చూసింది. ఆమె ఒంట్లోని రక్తమంతా నీరయిపోయినట్టయింది. కళ్ళు బైర్లుకమ్మాయి. కారణం కొడుకుల కళ్ళలో కనిపించిన భావమే.

సావిత్రమ్మ. డాక్టర్లు విస్తుపోయారు మరోసారి.

"అదికాదమ్మా... ఆయన..."

"నాకు మీరు చెప్పారుగా డాక్టర్‌గారూ! ఇంక ఆయనకేం పర్లేదని. అదే మా పిల్లలకీ చెప్పండి..." డాక్టర్ మాట పూర్తి కాకుండానే అంది సావిత్రమ్మ.

ఆమె కళ్ళల్లోని భావాలని చూసిన డాక్టర్లు మరి మాట్లాడలేదు. ముళ్ళమీదున్నట్టున్న కొడుకులకి ఆ మాట ఆనందాన్నిచ్చినా, అలాంటి పరిస్థితుల్లో తండ్రిని, తల్లిని వదిలిపోతే లోకులేం అనుకుంటారో అన్న అయోమయావస్థలో పడేసింది.

అది గమనించిన సావిత్రమ్మ వాళ్ళకి తనే ధైర్యం చెప్పి ప్రయాణం కట్టించింది. వాళ్ళు వెళ్తూ వందజాగ్రత్తలు చెప్పారు. మహేష్‌కి మరీమరీ చెప్పారు. "ఈసారి తొందరపడి ఫోన్ చేయకండి. అర్థమయిందిగా" అన్నారు గొంతు తగ్గించి.

మహేష్ మనసు గిలగిల్లాడిపోయింది.

"పర్లేదు పిన్నిగారూ! పంతులుగారు మళ్ళీ కోలుకోవచ్చు! మీరు బాధపడకండి!" అన్నాడు ఆప్యాయంగా.

ఆమె నవ్వింది. అయితే అతని మాట నిజంకాలేదు. మర్నాడే యాజులుగారు ఎలాంటి ఇంటిమేషన్ ఇవ్వకుండానే కన్నుమూశారు. బంధుమిత్రులంతా వచ్చారు.

సావిత్రమ్మ గుండెలవిసిపోయేలా ఏడుస్తుందనుకున్నవారంతా ఆమె నిర్లిప్తంగా వుండడం చూసి తెల్లబోయారు.

"పిల్లలకి ఫోన్ చేశారా? వాళ్ళొస్తున్నారా?" ఎవరో అన్నారు.

"తలకొరివి పెట్టాలి. అంతేగా. నా కొడుకు తలకొరివి పెట్టడానికి సిద్ధంగా వున్నాడు. మీరు ఏర్పాట్లు చేయండి" అంది సావిత్రమ్మ.

అయోమయంగా చూశారంతా.

"మహీ!..." అంది సావిత్రమ్మ.

మహేష్ వచ్చాడు.

"వెళ్ళి తలారా స్నానంచేసిరా! నాన్నగారి అంత్యక్రియలు చెయ్యాలి" అంది గంభీరంగా.

"ఏమిటి ఇతనా? ఇతను యాజులుగారి తలకొరివి పెడతాడా?" బుగ్గలు నొక్కుకున్నారంతా.

"అవును. ఇతనే ఆయన తలకొరివి పెట్టేది. అంతేకాదు రేపు నాకు కొరివి కూడా ఇతనే పెడతాడు. కానీ మా చావు కోసం క్షణాలు లెక్కబెట్టడు" పిచ్చిగా నవ్వింది సావిత్రమ్మ.

"ఈవిడకి మతి చలించిందా?" అన్నట్టు చూశారంతా. "కులమేమిటో తెలియని వీడు నీకొడుకెలా అవుతాడు! నువ్వలా అన్నావంటే రేపు ఆస్తిలో కూడా వాటా అడుగుతాడు!" అంది వృద్ధురాలు.

"వాటాకాదు. అంతా వీడిదే. ఈ ఇల్లు, పొలాలు అన్నీ మావారి కష్టార్జితం! అవన్నీ నా పేరుమీదే వున్నాయి. వాటికి నిజమైన వారసుడు కూడా వీడే. ఇంక ఆ దేవుడు దిగొచ్చి చెప్పినా నా నిర్ణయంలో మార్పుండదు" సావిత్రమ్మ గొంతు స్థిరంగా వుంది.

ప్రతిమల్లా అయిపోయారంతా. అదేం పట్టించుకోని సావిత్రమ్మ-

"మహీ... ఇందాక నేనిచ్చిన డబ్బు ఈ బాబాయిగారికివ్వు..." అంది. మహేష్ వందనోట్ల కట్ట ఒకటి తెచ్చి ఆమెకి మరిదివరసయ్యే అతనికిచ్చాడు.

"డబ్బు ఏమైనా చెయ్యగలదు" అన్నదాన్ని నిజం చేస్తూ అంతవరకూ మహేష్‌ని రకరకాలుగా కామెంట్ చేసిన వాళ్ళంతా నోట్ల కట్టని చూడగానే ఠక్కున నోళ్ళు మూసుకుని రంగంలోకి దిగారు. ఆమెకెదురు చెప్తే ఆమె విదిలించే చిల్లర డబ్బులు దొరకవనీ కావచ్చు.

వెంటనే యాజులుగారి అంత్యక్రియలకి ఏర్పాట్లు ఘనంగా జరిగిపోయాయి.

మరో గంటకల్లా యాజులుగారి శవం శాస్త్రోక్తంగా వూరికి ఉత్తరంగా సాగింది, ముందు నిప్పు పట్టుకుని మహేష్ నడుస్తుండగా.

అంతవరకూ ధైర్యాన్ని నటిస్తున్న సావిత్రమ్మ, ప్రాణంలో ప్రాణం అయిన భర్త భౌతికంగా దూరమవడంతో ఇంక నిలదొక్కుకోలేక శోకదేవతలా కుప్పకూలిపోయింది స్పృహ తప్పి.

శవ శకటం సాగుతూనే వుంది.

ఏ బంధానికీ నోచుకోని మహేష్ అనుబంధాన్ని పెంచుకోవడం... పంచుకోవడం అందరికీ ఆశ్చర్యమే కలిగించింది. ముఖ్యంగా కొడుకులిద్దరికీ. ●



2